మొండి వాదన

"తొందర పనిమీద ఒంగోలుకు పోవలసి వచ్చింది. ఇవ్వాళ సాయంత్రం ఆరుగంటల బండికి నేను ప్రయాణం. రెండు మూడు ధోవతులూ, తువాళ్లూ, చొక్కాలూ, ఏవో కావలసిన బట్టలు సూట్‌కేస్‌లో పెట్టేసి నేను వచ్చేసరికి రెడీగా వుంచాలె. నేను స్కూలునుంచి వచ్చీ రావడముతోనే భోజనంచేసి చప్పున వెళ్ళిపోవాలె. టైము ఆట్టే వుండదు తెలిసిందా?"

"తెలిసింది .... తెలిసింది. ఇందులో ఏముంది తెలియటానికి!"

"నేను చెప్పినట్లు చేస్తావా?"

"ఆ అట్లాగే"

అన్నది మా కాంతం. ఈ మాటలు చెప్పేసి నేను కోటు వేసికొని వెళ్ళిపోయినాను. సాయంత్రం కాళ్ళు ఈడ్చుకొంటూ వచ్చేసరికి అయిదు అయింది. వచ్చీ రావడంతోనే కాంతాన్ని పిలిచి "ఏం పెట్టె సర్దావా?" అన్నాను నవ్వుతూ.

"ఎంతలోకి సర్దాలె ఏమిటి, మీరు స్నానం చేసి భోజనం చేసేటప్పటికి నేనూ సర్దేస్తాను. ఏమంత మహాభాగ్యం?" అన్నది.

"ప్రొద్దుననగా చెప్పానే. ప్రొద్దుటి నుంచి ఇంత వరకూనూ తీరనేలేదా!"

"మీరు వెళ్ళిన దగ్గర నుంచీ నేనొక్క క్షణం అయినా కూర్చోలేదు. మిమ్ములను పంపించి, పిల్లల బట్టలన్నీ ఉతికి, కూడు తినేసరికి ఫిరంగి వేశారు. ఒక్కక్షణం కూరానో లేదో పిల్లలు రెండోసారి తిళ్ళకొచ్చారు. వాళ్ళకు అన్నాలు పెట్టి తలలు దువ్వి పంపాను. ఇంతలో మహాలక్ష్మమ్మగారు వస్తే ఆవిడతో రెండు నిమిషాలు మాట్లాడినాను. ఆవిడ అట్లా వెళ్ళింది. మీరు రానే వచ్చారు."

"ఇంతకూ నీవు పెట్టె సర్దలేదు?"

"అన్నీ సిద్ధంగానే వున్నాయి, సూట్‌కేసులో వేయడమే."

"అదే నేను చేయమన్నా పనీనీ! నీవు చేయందీని!"

చేసిందా? అదీలేదూ! నేను విసుక్కుంటే గడ్డిపరక కింద లెక్కేసి ప్రవర్తించి, కోపపడితే నిర్లక్ష్యంగా చూసి, పైగా ఈ కోపం నాకు అలవాటైనట్లుగా, తాను దానివలన బాధలు పడుతూ సహిస్తూ, సర్దుకుపోతున్నట్లు మాట్లాడే మనిషికి మొగుడై వుండేకంటే చస్తేనే మేలు అనిపించింది.

నేను యింత బాధపడ్డా ఆవిడ, చాలా శాంతంగా, తొణకకుండా, నిర్లక్ష్యంగా "ఆ పట్టండి. అవతల నాకు పనుంది పోవాలె. మీకేం అల్లాగ మూడు రోజులైనా శపించి పోట్లాడుతూనే వుంటారు."

"అంటే నేనెప్పుడూ పోట్లాడే మనిషినన్నమాట?"

"నేనన్నానా ఏమిటి నీవన్నది, నీవన్నదానికి అర్థం ఏమిటి?"

"ఏదో అన్నా లెండి. ఈ అర్థాలూ గిర్థాలూ నాకు తెలియవు. నేనేం చదువుకొన్న దాన్ని గాదు."

మూడురోజులైనా శపించి పోట్లాడుతూనే వుంటారని. మళ్ళీ మీరు పోట్లాడే మనిషని నేనన్నానా అంటుందీ – ఇదేమన్నా మనిషా లేకపోతే గ్రీకు కథలలోని మెడూసా ఆ....

బండికి పోవలసిన టైము అవుతున్నది. ఈ మాటలు చూస్తే, మండిపోతున్నది. కోపం దిగమ్రింగి పారేయ్, ఆ నాలుగు ధోవతులూ, ఆ చొక్కాలూ మూడూ, ఆ రెండు తువాళ్ళూ అందులో పడెయ్యి. ఆ సిల్కు ఉత్తరీయం కూడా కావాలె, వెయ్యి అన్నాను.

అది వద్దులెండి.

ఏం? నీ ఆజ్ఞ ఏమిటి? నాకు కావాలె. అది కూడా అందులో పడెయ్యి, టైము అయింది. తొందరగా స్టేషనుకు పోవాలె.

"నా ఆజ్ఞట? నా ఆజ్ఞలన్నీ సాగి ఏడుస్తున్నాయా? అది ఇంట్లో వుంచి ఇంకో ఉత్తరీయం తీసుకొని వెళ్ళండి. ఎందుకు చెప్పానో నా మాట వినండి."

"అబ్బబ్బ! ఎందుకు వద్దో చెప్పరాదూ?"

"మీరు స్నానం చేయండీ! నేనెంతలోకి చేస్తానూ?"

"పొద్దుననగా చెప్పిన పని చెయ్యటానికి నీకు ఇంత వరకు తీరిక కాలేదు. నీ మొండితనం చూస్తే వళ్ళు మండుతుంది. ఏమాత్రం పని ఇది, నీవు మాట విననందుకు అనాలె గాని!"

"ఇందులో మాట వినకపోవటం ఏముందండీ? ...."

ఇక చాలించని అన్నాను ఆ వరస చూచి. ఇందులో మాట వినకపోవడం ఏమీ లేదుట. మాట వినకపోవడం కాకపోతే ఏమీ లేదుట. మాట వినకపోవడం కాకపోతే మరేమిటి యిది. ఈ ఆడవాళ్ళకు ఈ మొండి వాదనలో ఇంత తెలివి ఇచ్చినందుకు ఆయనను ఏం జేసినా పాపంలేదు. ఏదో బద్ధకించాను, క్షమించండి అనరాదూ? క్షమించండి అని చస్తే నోట అనదు ఆవిడ. అనాలని జ్ఞానమే లేదు. కాబట్టి వాదించి లాభంలేదని "సరే ఇప్పుడైనా వేగిరం సర్దు" అని చెప్పి భోజనానికి వెళ్ళిపోయినాను. నేను భోజనం చేస్తూన్నంత సేపూ ఆవిడ ఇటూ అటూ తిరుగుతూ, ఆ పిల్లనూ, ఈ పిల్లనూ, కేకలు వేస్తున్నది. తీరంటా నేను భోజనంచేసి బట్టలు వేసుకొని ఏదీ పెట్టె .... అని అంటే అప్పుడూ కావిడి పెట్టెలో నుంచి ధోవతి తీసి ఇది కావాలా అని అడగటం.

"నీకు బుద్ధి ఉందా లేదా? అనవసరంగా బండికి పోవాలని నెత్తినోరు కొట్టుకుని అరుస్తుంటే నీకు చీమ కుట్టినట్లు అయినా లేదు. ఇప్పుడు బట్టలు తీసి అది కావాలా ఇది కావాలా అని అడుగుతావూ? ఈ వెధవ నిర్లక్ష్యం దేహశుద్ధితోగాని అణగదు."

నేనింత గట్టిగా తిడుతున్నా, ఆవిడ కదలకుండా ఆ ధోవతిని అల్లాగే పైకెత్తి పట్టుకుని నాకు కోపం వచ్చిందని భయంగాని విచారంగాని లేని గొంతుకతో – ఇంతకూ ఇది సూట్‌కేసులో వెయ్యనా వద్దా చెప్పండి అంటుంది.

నా కోపానికి భయపడలేదు. అందుకని నేను కొరకొర చూశాను. ఆ చూపుకు జవాబుగా నేను బ్రతికున్నన్నాళ్ళు మీకీ కోపం పోదులెండి అనడం.

నాకు ఈ అన్యాయం భరించరానిదని అనిపించింది, ప్రొద్దున చెప్పిన పని సాయంత్రం వరకూ చేయకపోవడం, నేను వచ్చిన తరువాత అయినా పశ్చాత్తాపపడి

"మీరెందుకు వింటారు. ముద్దుగా వినే మొగుడైతే గదా! ఆ నోము నేనోచుకోలేదు. ప్రతిదానికి కారణం చెప్పేడవాలె. ఆడచచ్చిందాన్ని ఎన్నింటికని చెప్పేది కారణాలు, మీరు దాన్ని పారేసుకొస్తారు."

"ఇన్ని మాట్లు ఇన్ని ప్రయాణాలు చేస్తున్నాను. ప్రతి దఫా పారేసుకొని వస్తున్నానా, ఏమిటా మాట?"

"ప్రతి దానికిని విసుగేన? అయినదానికీ కాని దానికీ కూడా? మీరు అసలు అజాగ్రత్త మనుషులు. ఎక్కడో మరచిపోయి వస్తారని మంచిమాట చెప్పినాను. సరుసులైతే ఎట్లా ఏడ్చేది?"

"నేను అజాగ్రత్త మనిషినా? బట్టలు ఊళ్ళవెంట పారేస్తున్నానూ? రెండు పెట్టెలూ, మూడు మూటలూ, తట్టలూ బుట్టలతోటి నీవు వెళ్ళినపుడు ఎందుకని నేను ఏమన్నా అన్నానా? అందులో మళ్ళీ ఎన్ని తిరిగి వచ్చినవి అని లెక్క చూశానా? నా బట్టల విషయమై కూడా నీకింత అధికారమేమిటి?"

"నా ఇష్టం వచ్చిన బట్ట నేను వాడుకోవడానికి కూడా నాకు అధికారం లేదా?"

"అదిగో మళ్ళీ మొదలు పెట్టారూ."

"మొదలు పెట్టింది నీవా నేనా" ఒక మాటు చీవాట్లు వేస్తే, సిగ్గు వుండి, అయ్యో, ఆయనకు మనస్సు కష్టం కలిగించే మాట అనకూడదని బుద్ధి, జ్ఞానం, వివేకం, తెలివి తేటలు వుంటేగా?"

"ఇప్పుడేమన్నానని చెప్పండి, అన్ని మాటలు అనటం నన్నూ?"

ఎన్నో మాటలు అన్నట్లు మాట్లాడుతావేం? ఆ మాటల కన్నిటికీ ఒకటే అర్థం.

"అవునవునూ. మీరెన్ని అన్నా బాగానే వుంటుంది! మీరన్న మాటల కన్నిటికీ ఒకటే అర్థం. నేనేమన్నా ఒక్క మాట తెలిసో తెలియకో అంటే నానా అర్థాలూ తీస్తారు."

"ఇక కట్టిపెట్టు. ఆ సూట్‌కేస్ ఇల్లా ఇచ్చేయి, వెళ్ళిపోవాలె. ఇంతకూ ఆ సిల్కు

ఉత్తరీయం వేశావా?"

"రేపు శుక్రవారంనాడు పేరంటానికి ఆ ఉత్తరీయం వోణీగా వేసుకొంటానని పిల్ల సరదాపడ్డది. అందుకని ఉంచేశాను. మీకిష్టం కాకపోతే తీసుకెళ్ళండి."

"పిల్ల కావాలన్నదని మొదటనే చెప్పకపోయినావూ? సరే ఆ పెట్టి ఇలా ఇచ్చెయ్యి."

"ఇదండి. అయితే మొన్న మా తమ్ముడిచ్చిన సేలం అంచు ధోవతులు తీసికెడుతున్నారు. ఎక్కడో పారేస్తారు. మీకు తగని మరుపు.॥

"అబ్బా, మనిషికి వుండే తెలివితక్కువతనం, మరుపూ, మొదలుగా గల దుర్గుణాలన్నీ నా ఒక్కడిలోనే చేరినట్లు మాట్లాడుతావు గదా! నీతో నాకూ ...."

"పోనీలెండి. ఇక బయలుదేరండి."

"బండిని కేకెయ్యవే అమ్మాయీ!"

"బండి ఎందుకూ! సూట్‌కేస్ చేతపట్టుకొని నాలుగు అడుగులు చర చర నడిచిపోరాదూ?"

"ఈ ఒకటిన్నర మైలూ, ఈ పెట్టి నెత్తిన వెసుకొని నేను నడవాలిసిందే?"

"మొగాళ్ళు ఎంతలోకి నడుస్తారూ?"

ఇక నీవు ఊరుకో. నన్ను మండించక, వెధవ,

వాగుడు వాగకూ, బండిని పిలవ్వే."

"................"

"ఉండవోయ్‌గురన్నా. బండిని ఆపమనవే అమ్మాయీ"

"ఎందుకే అమ్మాయీ?"

"అమ్మ ఆపమంటుంది నాన్నా."

"అమ్మకేం అట్లాగే అంటుంది. నాకు టైమయింది."

"వస్తున్నా, వస్తున్నా వుండండి. అబ్బ అయినంతసేపూ కాంగా ఇంతలో తొందర

వచ్చిందే? ఇందాక పోట్లాట వేసుకొని కూర్చుంటానికి ఏ తొందరలేదూ!"

"సరే కాని, నేనా పోట్లాట వేసుకొని కూర్చుందీ? పోట్లాడటానికైనా టైము లేదు. ఎందుకు ఆపినావు? అదేమిటి? ఆ చేతులో బుట్ట ఏమిటి?"

"కొత్త ఆవకాయ. దార్లో గుంటూరులో మా అక్కయ్య గారింట్లో ఇవ్వండి."

"ఏడ్చినట్లే వుంది. తీసుకొనిపో, వెధవ ఆవకాయబుట్ట మోసుకు పొమ్మంటావు? ఎఱ్ఱని ద్రవం దానిలో నుంచి కారుతూ వుంటుంది గదా?"

"మిమ్ములను మొయ్యమన్నానా? మీరు మొయ్యాలనా? స్టేషన్ దాకా ఎట్లాగూ బండి వుంది గదా? ఇక్కడ రైలులో పడేస్తే అక్కడ దింపటమే కదా! ఇక మీరు మోసేదెక్కడ"

"స్టేషన్ దగ్గర నుంచీ ఇంటికి ఎవరు మోస్తారు."

"స్టేషన్ దగ్గర నుంచి ఆ కాస్తదూరం చేత్తో పట్టుకుపోవచ్చు. పాపం, దాని పిల్లలకు చద్ది అన్నంలోకైనా వుంటుందని ఆశపడ్డాను. పోనీలెండి, ఆపేక్ష వుంటేగదా, నా మీదనూ, మా వాళ్ళమీదనూ, సరేపొండి ఏం జేస్తానూ?"

"ఓసీ తెలివితక్కువ మొద్దూ, బందరు నుండి ఒంగోలుకు పోయే దోవలో గుంటూరు తగలదు. అదీ అసలు సంగతి!"

"ఆ తగలకేం లెండి. ఇష్టమైతే బాగానే తగులుతుంది!!"

(1962)